త్రివేణి

శ్రీపతి బస్సుదిగి రోడ్డుమీద ప్రవహిస్తున్న రిక్షాలనూ, సైకిళ్ళనూ, స్కూటర్లనూ, బస్సులనూ. కాళ్ళనూ, జన సమూహాన్ని చూసుకుంటూ నడుస్తున్నాడు. ఆఫీసు వదిలిన వేళ. చల్లటి సాయంత్రం నగరం వరదలొచ్చినట్టుగా ఉరుకుతోంది. వేగంగా పరుగెత్తుతున్న ప్రవాహాన్ని చూస్తూ నెమ్మదిగా నడుస్తున్నాడు.

అతనికి కావల్సిన మజిలి వచ్చింది. చేతిలోని పుస్తకాన్ని ఓసారి చూసుకుని మజిలీలో అడుగు పెట్టాడు. ఆ మజిలీ పుస్తకాల గుడి పూజారి ఎదురుగా కూచున్నాడు. జీవితంతో యుద్ధంచేసి ఓడిపోయి గాయపడి లోతుకు పోయిన కళ్ళను పెకిలించుకుని మరీ చూస్తున్నాడా పూజారి- కాదు పుస్తకాల మనిషి. మాసిన గడ్డం- అస్తి పంజరానికి గుడ్డలు వేసి కూచో పెట్టినట్లుగావుంది. లోపలి ఎముకలు కన్పిస్తున్న పల్చటి లాల్చీ శరీరం సగంపైగా కప్పేసింది. గీరల పైజామా మెరుస్తున్నది. అతని ముఖమూ జుట్టూ త్రాగిన మైకంలో

రోడ్డుమీద విసిరేస్తే పగిలిన విస్కీ-సీసా ముక్కల్లా ఉంది. చేతిలో చిన్న పెన్సిల్ ముక్క. దాంతో మెడ దగ్గర గోక్కుంటున్నాడు.

శ్రీపతి పుస్తకం ఇవ్వగానే ఏవో కాగితాల్లో లెక్క చూసుకుని ఆరు రోజులు... అరవై పైసలు ... అన్నాడు. శ్రీపతి అరవై పైసలు చెల్లించి అతనివైపు బాధగా చూశాడు. మరేమైనా తీసుకోండి అంటున్నాడతను. అది చిన్న గేట్టు, బాగా రద్దీగా ఉంది. వచ్చేవాళ్ళూ పోయే వాళ్ళూ పుస్తకాలు తీసికెళ్ళేవాళ్ళూ వచ్చేవాళ్ళూ...బయట కొన్ని పత్రికలు వేళ్ళాడు తున్నాయి.

శ్రీపతి తీసికెళ్ళిన పుస్తకం అంత పెద్దదేమీ కాదు. ఒక రోజులో చదివెయ్యొచ్చు. "మొరేవియా" కథలు బద్ధకించి ఆరు రోజులుంచుకున్నాడు. ఆ కొట్లో ఒకవైపు ఇంగ్లీషు పుస్తకాలు- మరో వైపు తెలుగు పుస్తకాలు- పాత ఇంగ్లీషు పత్రికలు తెలుగు పత్రికలు, చిన్న పిల్లల ఫ్యాంటమ్ సాహిత్యం ఇంకా ఎన్నో ఉన్నాయి.

పెరీమేసన్. లారెన్స్. వోడ్ హౌస్, హెరాల్డ్ రాబిన్స్, ఇంకా ఇలాంటి పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. పుస్తకాల అట్టలమీద ఆకర్షణీయమైన బొమ్మలున్నా- పుస్తకాలన్నీ నలిగిపోయి కళాకాంతులూ లేకుండా ఉన్నాయి. అర్ధనగ్నంగా, ముప్పావు నగ్నంగా ఉండే బొమ్మలు ఎంత

మంది చేతుల్లోనోపడి నలిగిపోయినై కొన్ని బొమ్మలకు ముక్కు మొఖము కన్పించడం లేదు. తెలుగు పుస్తకాలలో ఎక్కువ శవసాహిత్యం - చౌకబారు ప్రేమ కథలూ... అక్కడక్కడ మంచి నవలలూ ఉన్నాయి. ఒక పక్కన ఇంగ్లీషు పత్రికలు లైఫ్...టైమ్; సాటర్ డే ఈవినెంగ్ పోస్ట్, సైన్సు పత్రికలూ "ట్రూడిటెక్టివ్"-ఫొటోగ్రఫీ పత్రికలూ- జాగ్రాఫికల్ మేగజైన్, పినప్ గరల్స్ మాడల్స్, ఇంకా ఎన్నో ఉన్నాయి. తెలుగులో కామ సూత్రాలు, కామతృష్ణ, లైంగిక విజ్ఞానం. పడకటింటి రహస్యాలూ... భార్యను వశ పర్చుకుండే దెలా. మొదలైనవి. కొన్ని పుస్తకాలకు, పత్రికలకు క్లిప్స ఉన్నాయి.

శ్రీపతికి ఫొటోగ్రఫీ పత్రికమీద కన్ను పడింది. దానిమీద "స్టడీ ఆఫ్ ఫిఫ్టీ రీడర్" అని వున్నది. పత్రికకు క్లిప్, వున్నది. శ్రీపతి ఆ పత్రికను తీసుకున్నాడు.

అలాంటివి ఇంటికి తీసుకుపోగూడదు. ఇక్కడే చూడాలి. పది నిమిషాలు ... పది పైసలు ... అన్నాడు పూజారి. పది పైసలిచ్చి కొట్లో ఒక మూలగా వెళ్ళి తన నెవరైనా చూస్తున్నారేమో అని అటూ ఇటూ చూస్తూ పేజీలు తిరగేస్తున్నాడు. అయిదు నిమిషాల్లో అయిపోయింది. మళ్ళీ మొదటి పేజీనుండి చూస్తున్నాడు దాని కోసం మరో వ్యక్తి పక్కన నిల్చున్నాడు క్యూలో కొంతమంది పుస్తకాలు సెలెక్టు చేసుకుంటున్నారు. ఎవరో ఆడపిల్లలు... బహుశ కాలేజీ పిల్లలల్లే వున్నారు. చలం పుస్తకాలు తీసుకుంటు న్నారు.

పుస్తకాలు కొని చదువుకోలేని వాళ్ళకు ఈ కొట్టు— ఓ గుడి. పుస్తకం ఖరీదు డిపాజిట్టుగా ఉంచుకుని పుస్తకం ఇస్తాడు పూజారి. అద్దె రోజుకు పది పైసలు, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుండే వాళ్ళకు, కాలేజీ విద్యార్థులకు, వంట ఇంట్లో ఎప్పుడూ సతమత మవుతున్న అమ్మలక్కలకు— ఈ కొట్టు ఓ నిధి. ఇంట్లో కాలక్షేపం కోసం పత్రికలు తీసికెళ్ళి చదివి మళ్ళీ తెస్తుంటారు. పది పైసలతో మంచి మంచి పత్రికలన్నీ చదివెయ్యొచ్చు. ఎక్కువగా సీరియల్స్ వున్న పత్రికలకు డిమాండు. అందరికీ అన్ని పత్రికలూ చదవాల్నే వుంటుంది. కొని చదవలేరు.

నగ్న చిత్రాలున్న పత్రికలైతే మధ్య వయస్కులు, వృద్ధాప్యం వచ్చీ రాని వాళ్ళూ... పుస్తకాలు ఇంటికి తీసుకు పోవడానికి భయపడేవాళ్ళూ. వాళ్ళని ఎక్కువ ఆకర్షిస్తాయి. వాటికి రష్ చాలా ఎక్కువ పూజారి అందరికీ ప్రసాదాలిస్తూ బిజీగా వుంటాడు.

శ్రీపతి "లారెన్స్" పుస్తకం తీసుకుని బయటకు వస్తూ... వెధవ బ్రతుకు పుస్తకాలు గూడా అద్దెకు తీసుకో వల్సి వచ్చిన ఖర్మ... అనుకున్నాడు.

శ్రీపతి వంటరివాడు. చాలీ చాలని జీతం ఎదుగూ బొదుగూ లేని జీవితం. పెళ్ళి చేసుకోవడానికి భయం. సంసారం భరించడం కష్టం. ఈ నగరం ఇల్లు దొరకడమే

పెద్ద సమస్య. జీతంలో కనీసం నాలుగోవంతు అద్దెకు పోతుంది. పెళ్ళి చేసుకుని పిల్లల్ని కంటే...పాల డబ్బాలకూ, చీరెలకూ, సినిమాలకూ బోలెడు ఖర్చు. ఈ ఖర్చును ఊహించుకుంటే పై ప్రాణం పైనపోతుంది. తనను చూసి, తన జీతాన్ని చూసి పిల్ల నెవరిస్తారు పైగా ఏవరో దౌర్భాగ్యులు తప్ప అందమైన అమ్మాయి దొరికితే చేసుకుందామనే ఉంది శ్రీపతికి.

చూస్తూ చూస్తూ తనకెలా దొరుకుతుంది పోనీ పెళ్ళి లేకపోతే పోయె...కనీసం ఎవరైనా గరల్ ఫ్రెండ్ అన్నా ఉంటే బావుండు అనుకుంటాడు—ఒకవేళ ఎవరైనా తటస్థ పడినా బోలెడు ఖర్చుపెట్టాలి. సినిమాలకు హోటళ్ళకు తిప్పాలి. ఏమైన ప్రజంట్సు ఇవ్వాలి. ఇవన్నీ తడిసి మోపెడవుతుంది. అది ఖరీదైన స్నేహం పోనీ దానికైనా సిద్ధపడదామంటే సంఘం...ఒకటి...బోలెడు కట్టుబాట్లు, బాహాటంగా ఇలాంటి పనులు ఈ దేశంలో పనికిరావు. శ్రీపతికి ఒకసారి ఏ జపాన్లోనో, జర్మనీలోనో స్వీడన్‌లోనో ఉంటే బావుండుననిపించింది. అవన్నీ గొంతెమ్మ కోరికలు. రోడ్డుమీద పోతున్న ఏ అందమైన అమ్మాయిని చూసినా కోరికలు పెంచుకుంటాడు. కోరికలు కోరికలుగానే ఉండిపోతాయి. ఒక్కొక్కప్పుడు కలలో కోరిక ఫలిస్తుంది. తన

అసమర్థతకు అర్థం చెప్పుకుంటాడు తను దురదృష్టవంతుణ్ణనీ, పిరికి వాణ్ణనీ, ఏదో కాంప్లెక్సుతో బాధ పడ్తున్నాననీ.

తన పెళ్ళిని గురించి ఎవరూ పట్టించుకోరు. తనంతట తానుపోయి నాకు పెళ్ళి కావాలని ఎవ్వరినీ అడిగే ధైర్యం లేదు. ఇది జడ్డు సమస్య అయిపోయింది. జాతకాలు కావా లంటారు. గోత్రాలు సరిపోవాలి. అతనున్న పరిస్థితులలో తండ్రిని గురించి చెప్పుకోవడం ఇష్టంలేదు. తల్లి తండ్రి ఇద్దరు విడిపోయి ఎన్నాళ్ళో అయింది. తండ్రి కులం కాని ఆమెని ఎవర్నో ఉంచుకున్నాడని...ఆ పల్లెటూర్లో...తన స్వంత ఊర్లో ఆయన్ను వెలివేశారు, తండ్రిని గురించిన వివరాలెవ రైనా అడిగితే చెప్పటానికి సిగ్గుగా ఉంటుంది. తనకు పెళ్ళి అయ్యే యోగ్యత లేదని అనుకుంటూ ఉంటాడు పుస్తకాల చుట్టూ తిరుగుతున్నాడు.

ఆ రోజు రాత్రి చాలా సేపటివరకు లారెన్స్ పుస్తకం నెమరువేశాడు. బ్రహ్మాండంగా ఉందనుకున్నాడు. ప్రతి రచ యితా తనను ఓదారుస్తున్నట్టే ఉంటుంది పుస్తకం పూర్తి చేసి—ఒక్క పదిపైసలలో ఎంత ఆనందం అనుకున్నాడు. పుస్తకం ఆఫీసుకు తీసుకువెళ్ళాడు. సాయంత్రం తిరిగి వచ్చే టప్పుడు దాన్ని రిటర్న్ చేయచ్చునని. బస్సులో ప్రయాణం చేస్తుంటే పక్కన ఎవరో పదేళ్ళ పసివాడు కూర్చుని కిటికి

లోంచి రోడ్డువైపు చూస్తున్నాడు శ్రీపతి ఆ పిల్లవాణ్ణి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. పిల్లవాడికి ఆలోచనకు సంబంధంలేదు. ఆలోచనలు లారెన్స్ కథమీాద. రాత్రి చదివింది నెమరు వేసుకుంటున్నాడు. మనసు ఒకటి ఆలోచిస్తుంటే కళ్ళు మరో వైపు చూస్తుంటాయి. అతడి కళ్ళు పిల్లవాణ్ణి చూస్తున్నాయి. బస్సులో శరీరం కదులుతున్నది బస్సు వేగంగా పోతున్నది. చూపు శరీరానికి సంబంధించినది. ఆలోచన మనసుకు సంబంధించినది. కళ్ళున్నాయి గనుక దేనినో ఒకదాన్ని చూడాలి కనీసం వెలుతురునైనా, పగటి పూట కళ్ళు మూసుకుని ఎవరూ ఆలోచించరు. అందుకని శ్రీపతి కళ్ళు తెరిచే ఉన్నాడు.

బస్సుదిగి "మజిలీ" కోసం వెళ్తున్నాడు చేతులు ఊపు కుంటూ, ఊగుతున్న కుడిచేతివైపు చూసుకుంటే—పుస్తకం లేదు. గుండె ఆగిపోయినంత అయింది. చిన్న షాక్, పుస్తకం బస్సులో మరచి పోయినాడు. తన డిపాజిట్ అయిదు రూపాయలు నష్టం. అయిదు రూపాయలంటే కాస్తో కూస్తో కాదు.

వ్యాపారం చేసేవాడు లక్షలు నష్టం వచ్చినప్పుడు బాధపడ్డట్టుగా ఉంది శ్రీపతికి బిక్కమొహం వేశాడు. తన మామూలు మజిలీకి వెళ్ళడమూ-మానడమూ అను కుంటున్నాడు. పూజారికి సంజాయిషీ చెప్పుకుని ఏదైనా

బొమ్మల పుస్తకం పది పైసలిచ్చి అక్కడే చూడవచ్చుననుకున్నాడు.

పూజారిని చూస్తూనే శ్రీపతి "సారీ" అంటూ కదనం మొదలెట్టాడు.

"ఏం ఫర్వాలేదు...మీరు బాధ పడకండి. ఎవరికైనా దొరికితే యిక్కడికే తీసికొచ్చి ఇస్తారు. దాంట్లో మనకొట్టు ముద్ర వుందిగా" అన్నాడు.

శ్రీపతికి ధైర్యం వచ్చింది. ఆ సంతోషంలో పదిపైసలిచ్చి బొమ్మల పుస్తకం మీద పలేబడ్డాడు. ఆ రోజు కొట్లో శ్రీపతి చాలాసేపు ఉన్నాడు. ఒక్కొక్కరేవచ్చి వెళుతున్నారు. అంతరద్దిగాలేదు. శ్రీపతికి పూజారితో మాట్లాడుదామనిపించింది.

"మనకు పరిచయం ఉన్నా మనం ఎప్పుడూ తీరుబాటుగా మాట్లాడుకోలేదు. మీపేరేవిటండీ అన్నాడు శ్రీపతి.

"నన్ను శివయ్య అంటారు" అన్నాడు ముక్తసరిగా. శ్రీపతి ఎదురుగా ఉన్న చిన్న హోటల్లో యిద్దరికీ కాఫీ తెప్పించాడు. సిగిరెట్లతో యిద్దరూ కొంచెం దగ్గరగా వచ్చారు.

"నా కంతగా అలవాటు లేదండీ" అంటూ శివయ్య సిగిరెట్టు ముట్టించాడు.

పొగ పుస్తకాలమీద వదుల్తూ...

"లారెన్స్ కథను ఆలోచిస్తూ లారెన్స్‌ను బస్సులో వదిలేశారు" అన్నాడు శివయ్య.

శివయ్యలో కూడా హ్యూమర్ వుందే అనుకున్నాడు శ్రీపతి.

"మీపనే బావుంది. హాయిగా పుస్తకాలు ప్రసాదం ప్రసాదం అందరికీ పంచిపెడుతూ...కాలుమీద కాలువేసుకుని కూర్చుంటారు" అన్నాడు శ్రీపతి కొంచెం హ్యూమరస్‌గా మాట్లాడుదామని.

"మిమ్మల్ని చూస్తుంటే మీకింకా పెళ్ళికాలేదని పిస్తోంది...అవునా అన్నాడు శివయ్య.

శివయ్య కేవలం పుస్తకాల మనిషేకాదు మామూలు మనిషికూడా అనుకున్నాడు శ్రీపతి.

శ్రీపతికీ శివయ్యకూ సంభాషణ చాలా విషయాల మీదకు వెళ్ళింది. సంభాషణలో శివయ్య ఒకటి రెండుసార్లు పెద్దగా నవ్వాడు.

"అమ్మబాబోయ్ శివయ్యకూడా నవ్వగలడు" అనుకున్నాడు శ్రీపతి.

శ్రీపతికి శివయ్యకూ స్నేహం చిగురించింది. రెండు రోజులకొకసారన్నా కలుసుకుంటుండేవాళ్ళు

చిగురించిం తరువాత రెండోసారి కలుసుకున్నప్పుడే శ్రీపతికి బోలెడంత సంతోషం దొరికింది తన బస్సులో పారేసుకున్న పుస్తకం మళ్ళీ గుడికి చేరింది.

"ఎవరో పిల్లవాడు తెచ్చియిచ్చాడు అన్నాడు శివయ్య.

"ఆ పిల్లవాణ్ని చూడాలి"

"మీకు నిజంగా చూడాలనివుంటే చూపిస్తాను కొట్టు కట్టేసిం తరువాత నాతో రండి.

పోయిన పుస్తకం దొరకడం, శివయ్య స్నేహం లభించడం-శివయ్య తనమీద జాలిపడడం ఇవన్నీ చూసి శ్రీపతికి

పసుగక్కినంత పనయింది. ఎవరో ఆప్తులు కన్పడ్డట్టే అయింది.

శివయ్య వాళ్ళింటికి తీసుకు వెళ్ళతాడేమో ఆ పిల్లవాడు శివయ్య కొడుకేమో అని అనుకుంటున్నాడు శ్రీపతి.

శ్రీపతి శివయ్య మాట్లాడుకుంటూ నడుస్తున్నారు.

ఎక్కువగా శ్రీపతే మాట్లాడుతున్నాడు.

శివయ్య వింటున్నాడు.

"మీరు పెళ్ళి చేసుకోరాదూ. కుర్రాళ్ళే గదా బావుంటుంది" అన్నాడు శివయ్య.

"అవును పెళ్ళి కుదిర్తేగాని పిచ్చి కుదరదు, పెళ్ళి కుదరద్దూ."

"మీ కెలాంటి పిల్ల కావాలి?"

"ఎవరైనాసరే...మూగ, చెవుడూ, గుడ్డీ కాకుండా వుంటే ఫరవా లేదు."

"నాకు మాట ఇస్తారా?"

"ఓ అంత అందంకూడ అక్కర్లేదు ఆరోగ్యంగా వుంటేచాలు."

శివయ్య నవ్వుకున్నాడు.

శివయ్యకు కూతురుందేమో. నా కిచ్చి అంటకడతా ననడుకదా, చేసుకోక పుస్తకాల మనిషి కూతురునా అను కున్నాడు శ్రీపతి. తొందరపడి మాటకూడా ఇచ్చాడు. మాటతీసుకోడం బావుండదు ఎంత చిన్న ఉద్యోగం చేస్తున్నా ఇంతవరకు నిజాయితీగానే బ్రతుకుతున్నాడు. ఒక్కసారి శ్రీపతి కెందుకో భయంవేసింది.

శ్రీపతి శివయ్య నడుస్తున్నారు. చాలా దూరం నడి చారు కొన్నిరోడ్లు మారేరు. అక్కడక్కడ కొంత ఖాళీ స్థలం. దూరం దూరంగా మేడలు, మేడల నీడల్లో చెదురు మదురుగా గుడిసెలు. గుడిసెల్లో చిన్నచిన్న బుడ్డిదీపాలు గాలికి రెపరెపలాడుతూ చీకటితో పెనుగులాడుతున్నాయి. ఒక గుడిసె దగ్గిరగా వెళ్లేరు. గుడిసెల్లో ఓ పిల్లవాడు కనపడీ కనపడని వెలుతుర్లో ఏదో చదువుకుంటున్నాడు. ఎవరో ఆడ మనిషి పక్కనే పడుకుని ఉంది.

శివయ్య నివాసం గుడిసెలో కాదుగదా. అను కున్నాడు శ్రీపతి.

"అదుగో చదువుకుంటున్న పిల్లవాడే మీ పుస్తకం తీసుకుని ఇచ్చినవాడు. పక్కన పడుకున్న ఆమె తల్లి.

వాళ్లు మీకేమవుతారు. అని అడగడానికి సందేహిస్తున్నాడు. శివయ్య గతాన్ని అడగవద్దని ఇదివరకే ఒక సారి హెచ్చరించాడు. ఇది వర్తమానమేమో, శ్రీపతికీ అను మానంగానూ ఆశ్చర్యంగానూ ఉంది.

ఇక వెడదామా అన్నాడు శివయ్య.

అడుగు వెనక్కు వేయడానికి సందేహిస్తూ శ్రీపతి ఆ పిల్లవాడు... ఆ పిల్లవాడు...అని గొణుక్కుంటున్నాడు.

"ఆ పిల్లవాడు ఆమె నాకేమీ కారు. బడికి జీతం కట్టడానికి డబ్బు లేదని నా కొట్టుకు ఓసారి వస్తే జాలేసి ఓ రూపాయి ఇచ్చాను. అప్పటి నుండీ స్నేహం అయింది. వాడితో అక్కడ అక్కడ కొట్లలో అడుక్కుని డబ్బులు పోగుచేసి చదువుకుండే వాడు. ఇప్పుడు నేనే చదివిస్తున్నాను. వాళ్ళమ్మ నాలుగు మేడల్లో పనిపాటా చేసుకుని అంట్లు తోముతూ సంపాయిస్తుంది. ఆ పిల్ల వాడికి తండ్రి లేడు.

అతడు పుట్టగానే పోయినాడు. నా భార్యకూడా బ్రతికి ఉంటే ఆ పిల్లవాని తల్లి వయసే ఉండది.

మేడల్లో వెలుగుతున్న బల్బుల కాంతి కన్నా, గుడిసెలో మిణుకు మిణుకు మంటున్న దీపమే ఎక్కువ కాంతిగా కన్పిస్తున్నది. చీకటిని బాణంతో ఛేదించినట్టుగా.

ఇద్దరూ తిరుగు ముఖం అయినారు.

శివయ్య ఏదో చెప్పాలనుకుంటున్నాడు.

శ్రీపతి ఏదో అడగాలనుకుంటున్నాడు.

"కొంత స్వార్థం కూడా ఉంది లెండి" అంటున్నాడు శివయ్య.

ఇది శరీరం కదు...

శ్రీపతీ శివయ్య చాలా దూరం నడచి కోట్లు దాకా వచ్చారు.

"నా నివాసం ఇక్కడ నుండి మరో మైలు పోవాలి." అన్నాడు శివయ్య.

"హోటల్లో కొంచెం టీ త్రాగుదాం రండి" అన్నాడు శ్రీపతి...

టీ త్రాగుతూ శివయ్య అసలు సంగతి కొచ్చి "ఆ అమ్మాయి తండ్రికి సహాయం చేస్తానని మాట ఇచ్చాను, ఎవరయినా బుద్ధిమంతుడు కన్పిస్తాడేమోనని వెతుకుతుంటే మీరు కన్పించారు." అన్నాడు శివయ్య.

"నేను మీకు కన్పించడం కాదు. మీరే నాకు కన్పించారు." అన్నాడు శ్రీపతి.

"వాళ్ళదీ ఒకప్పుడు మంచి కుటుంబమే ఓడలు బళ్ళయినై... బ్రతుకును ఈడ్చుకు వస్తున్నాడు అతను"- శివయ్య.

అయిపోయిన సిగరెట్టును యాష్ట్రేలో పడేసి మరోటి ముట్టించి—ఒకటి శివయ్య కిచ్చాడు శ్రీపతి.

"ఇంకా వినండి ఆ అమ్మాయికి పోలియో వచ్చి చిన్నప్పుడు రెండు కాళ్ళూ దెబ్బతిన్నై. కొంచెం కుంటుతూ నడుస్తుంది. మూగ, గుడ్డి, చెవుడు కాకుండా వుంటే ఫరవాలేదన్నారుగా. మీరు "ఊ" అంటే ఆ అమ్మాయి తండ్రి మీకు ఋణపడి ఉంటాడు. నా మాట నిలబెట్టుకున్న వాణ్ణవుతాను. నాకూ తృప్తి." అన్నాడు శివయ్య శ్రీపతి బుజం మీద చేయివేస్తూ.

శ్రీపతి సిగరెట్టు పొగ వదుల్తూ:

నేనూనూ... నేనూనూ... నాకూనూ... నాకూనూ ... మాటలు మాటలు తడబడుతున్నాయి. తృప్తే... అన్నాడు. ఏదో మాట్లాడాలను కున్నాడు. మాటలు రాలేదు. శివయ్య బుజంమీద చేయివేశాడు!

చు క్కా ని

... 0~0~0 ...